జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం


WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండలం రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | బుధవారం 13 మే 2026 | సంపుటి : 16 | సంచిక : 288 | పేజీలు : 8 | వెల : 1/- | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# కాంగ్రెస్ బీజేపీ అక్రమ సంబంధాన్ని ఎండగట్టిన బీఆర్ఎస్ నేతలు

## పోస్కో కేసు బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్ హెచ్-65 పై భారీ నిరసన

**శేరిలింగంపల్లి, మే 12 (ప్రజాజ్యోతి):**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సంచలనం రేపిన పోస్కో కేసు ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం మరియు బీజేపీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి బీఆర్ఎస్ నాయకుడు పొట్ట నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి ఎన్ హెచ్-65 హైవేపై బైఠాయించి రోడ్డును దిగ్బంధించారు. మైనర్ బాలికకు న్యాయం చేయాలి,దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి,కాంగ్రెస్ బీజేపీ రాజకీయ నాటకాలు ఆపాలి అంటూ నినాదాలు చేశారు. .మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి మాట్లాడుతూ...తెలంగాణలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. దోషులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.నిరసనలో మాట్లాడిన పొట్ట నరేందర్ యాదవ్ మాట్లాడుతూ...ప్రజల భద్రతను కాపాడాల్సిన ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం మౌనం వహించడం దురదృష్టకరం. మైనర్ బాలికపై జరిగిన అమానుష ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం మరియు బీజేపీ నాయకత్వం స్పష్టమైన వైఖరి చెప్పాలి. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు అని హెచ్చరించారు.ఈ ఆందోళన కార్యక్రమంలో రోజా,మమత, నాగమణి,వల్ల హరీష్, మిథెల మల్లారెడ్డి, తిరుమలేష్, కె.రాములు, బీఎస్ఎన్ కిరణ్ యాదవ్,సంతోష్ రెడ్డి,రామకృష్ణ గౌడ్, శివరాజ్, బొపరాజు శ్రీనివాస్,శ్రీకాంత్, ప్రకాష్, వడ్డే శ్రీనివాస్,వాకిటి శంకర్,నవీన్ యాదవ్, ప్రమోద్, ఘౌస్,బాబు మల్లేష్,సుభాష్ రాథోడ్, బీఆర్ఎస్వీ రాజు,షరీన్, వడ్డే రాజు,జహంగీర్ తదితరులు పాల్గొని బాధిత బాలికకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ నిరసన కారణంగా కొంతసేపు ఎన్ హెచ్-65 పై ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా,పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నాయకులతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.






# పోలీసు సిబ్బందిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి.

సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

తొమ్మిది మందిని అరెస్టు చేసిన పోలీసులు

పశువులను తరలిస్తున్నారని ఆరోపిస్తూ దాడులకు పాల్పడిన వ్యక్తులు.



# మేడ్చల్ కోర్టు సంచలన తీర్పు

## బాలుడి హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష, మరొకరికి జీవిత ఖైదు

## చీటీ డబ్బులు అడిగినందుకు కక్షతో బాలుడి హత్య

**కూకట్ పల్లి, మే 12 (ప్రజా జ్యోతి) :**





బాలుడి హత్య కేసులో సంచలన తీర్పు ఇచ్చిన మేడ్చల్ కోర్ట్. 2023 సంవత్సరం ఏప్రిల్ 20వ తేదీన సనత్ నగర్ పోలీస్ స్టేషన్ లో నమోదైన బాలుడి హత్య కేసులో నిందితులలో ఒకరికి ఉరిశిక్ష మరొకరికి జీవిత ఖైదు విధించిన మేడ్చల్ జిల్లా మూడవ అదనపు మెజిస్ట్రేట్ మండవ వెంకటేశ్వరరావు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జివి రామకృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి అల్లావుద్దీన్ కోటిలో వసీంఖాన్ వస్త్ర వ్యాపారం చేసుకుంటూ తన భార్య, కుమారుడు వహీద్ ఖాన్ (8), ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటున్నాడు. రోజువారి లాగే 20 ఏప్రిల్ 2023రోజున సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఇంటికి సమీపంలో మసీదుకు కుమారుడు వహీద్ తో కలిసి ప్రార్థన కోసం వెళ్ళాడు. వహీద్ తనతో ఇంటికి రాకపోవడంతో సాయంత్రం 6 గంటల ప్రాంతం నుండి వెతకడం ప్రారంభించారు. కుమారుడి ఆచూకీ లభించకపోవడంతో సనత్ నగర్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా బస్తీలో నివాసం ఉండే ట్రాన్స్ జెండర్ ఇమ్రాన్ ఖాన్ బాల్ ని హత్య చేసి సమీపంలోని నాలాలో పడేసినట్టుగా గుర్తించారు. వహీద్ కు చాక్లెట్ ఆశ చూపి ఇంట్లోకి పిలిచి తాడుతో గొంతుకు ఉరిబిగించి హత్య చేసి బాలుడి మృతదేహాన్ని ప్లాస్టిక్ సంచిలో చుట్టి స్నేహితుడు రఫీక్ ఆటోలో తరలించి సమీపంలోని దీన్ దయాల్ నగర్ నాలాలో పడేశారు. ప్రత్యక్ష సాక్షులు లేనటువంటి ఈ కేసులో టెక్నికల్ ఇవేడెన్సెస్ సి సి టివి పుటజ్, కాల్ డేటా ద్వారానే పోలీసులు నేరస్తులకు శిక్ష పడేలాగా పనిచేశారని పోలీసులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ రావు అభినందించారు. చీటీ డబ్బులు అడిగినందుకే కక్ష పెంచుకొని వాహద్ హత్య చేసినట్టుగా దర్యాప్తులో భాగంగా పోలీసులు గుర్తించారు. వసీం బావమరిది ఆసిమ్ నిందితుడు ఇమ్రాన్ అలీ ఖాన్ వద్ద ఐదు లక్షల రూపాయల చీటీ వేషాడు, అందుకు గాను నాలుగు లక్షల రూపాయలు ఇవ్వవలసి ఉంది డబ్బులు ఇవ్వాలంటూ వసీం ఇమ్రాన్ ను ఒత్తిడి చేయడంతో కక్ష పెంచుకున్న ఇమ్రాన్ వహీద్ కుమారుడు వహీద్ (8) హత్య చేశాడు. పోలీసులు సరైన ఆధారాలు ప్రవేశపెట్టడంతో మేడ్చల్ జిల్లా మూడవ అదనపు న్యాయమూర్తి మంగళవారం రోజున నిందితులలో మొదటి ముద్దాయి ఇమ్రాన్ ఖాన్ కు ఉరిశిక్ష, మృతదేహాన్ని తరలించడానికి సహాయపడిన రఫీక్ కు జీవిత ఖైదు విధించారు. హత్య గురైన బాలుడు తండ్రి వసీంఖాన్ మాట్లాడుతూ తన కుమారుడిని చంపిన వాడికి సరైన శిక్ష పడింది అంటూ ఇంకా దేశంలో న్యాయవ్యవస్థ బ్రతికే ఉందంటూ, పోలీసు వ్యవస్థకు న్యాయవ్యవస్థకు కృతజ్ఞతలు తెలియజేశాడు.

# పిఎసిఎస్ చైర్మన్ ఇంట్లో వికసించిన మే పుష్పం..

## మక్కువతోనే పూల మొక్కలు పెంచుతాను చైర్మన్ పాండురంగ రెడ్డి

**ఇబ్రహీంపట్నం 12 మే ప్రజాజ్యోతి:**

సంవత్సరానికి ఒకసారి పూసే మే పుష్పం పిఎసిఎస్ చైర్మన్ ఇంట్లో వికసించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ గ్రామానికి చెందిన పిఎసిఎస్ చైర్మన్ ఏదుళ్ళ పాండురంగారెడ్డి ఇంట్లో మే పుష్పం వికసించడంతో సంతోషం వ్యక్తం చేశారు. మొక్కలలో చాలా అరుదుగా సంవత్సరానికి ఒకసారి పువ్వులు పూసే మొక్కలలో మే పుష్పం ఒకటి. అయితే శేరిగూడ గ్రామానికి చెందిన పిఎసిఎస్ చైర్మన్ పాండురంగ రెడ్డి, మొక్కలపై మక్కువతో తన ఇంటి చుట్టూ పెరట్లో పూల మొక్కలను ఎక్కువగా పెంచుతూ ఉంటారు. ఈ సంవత్సరంలో ప్రస్తుతం మే నెల కావడంతో తన ఇంట్లో మే పుష్పం వికసించడంతో పలువురు చూడడానికి తరలివచ్చారు. దీంతో ఆయన తన ఇంట్లో మే పుష్పం వికసించడం ఎంతో సంతోషంగా ఉందని, పూల మొక్కలను పండ్ల మొక్కలను పెంచడం తనకే ఎంతో ఇష్టమని ఈరోజు తమ ఇంట్లో మే పుష్పం పూయడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు.



## హోంగార్డు వెంకటయ్య భౌతిక కాయానికి నివాళులర్పించిన డా.టి.రితిక్ రెడ్డి





**దోమ మే 12 ( ప్రజా జ్యోతి ) :** మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామానికి చెందిన తలారి వెంకటయ్య హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు.యువ నాయకులు,టీపీసీసీ మెంబర్ డాక్టర్ టి.రితిక్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి వెంకటయ్య భౌతిక కాయానికి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.వారి కుటుంబానికి అండగా ఉంటామని,ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**బషీరాబాద్ 12ప్రజాజ్యోతి:** బషీరాబాద్ మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు సిసి రోడ్డు పనులు ప్రారంభించారు.సేవాలాల్ విగ్రహము నుండి పాత పోలీస్ స్టేషన్ వరకు మంగళవారం రోజు సిసి రోడ్డు పనులు ప్రారంభించడంతో మోక్షం లభించింది ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ సీసీ రోడ్డు పనులు ప్రారంభించడం జరిగింది. బషీరాబాద్ నుండి కరన్ కోట్ వరకు డబుల్ రోడ్డు కు రూ.30 కోట్లునిధులు మంజూరు అయ్యాయి డబులురోడ్డు పనులు జోరుగా కొనసాగాయి, ఎమ్మెల్యే చొరవతో త్వరలో పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్, నరసింహారెడ్డి, ఇంజనీరింగ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో బండి సంజయ్ పై విమర్శలు

– కుమారుడిని వెంటనే అప్పగించాలని డిమాండ్



**వికారాబాద్ ప్రతినిధి, మే 12(ప్రజా జ్యోతి):** పోక్సో చట్టం కింద నమోదైన కేసులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్లు రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్నాయి. కేసు నమోదైన అనంతరం భగీరథ్ కనిపించకుండా పోవడం వివాదానికి దారితీసింది. డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ, తన కొడుకు తప్పు చేయకపోతే దాచిపెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. బాధ్యత గల ప్రజాప్రతినిధిగా బండి సంజయ్ తన కుమారుడిని వెంటనే పోలీసులకు అప్పగించాలని సూచించారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందన ఆలస్యంగా ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ వ్యక్తి అయితే వెంటనే అరెస్ట్ చేసి చర్యలు తీసుకునే పోలీసులు, ఈ కేసులో మాత్రం నెమ్మదిగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే, సోషల్ మీడియా కేసుల్లో వేగంగా చర్యలు తీసుకునే ప్రభుత్వం, ఇలాంటి తీవ్రమైన కేసులో ఎందుకు ఆలస్యం చేస్తుందో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మైనర్ బాలికకు న్యాయం జరగాలంటే కేసును ప్రభావితం చేయకుండా విచారణ వేగవంతం చేయాలని కోరుతున్నారు. పోక్సో చట్టం అత్యంత కఠినమైనదని, రాజకీయ ప్రభావాలకు అతీతంగా చట్టం తన పని తాను చేయాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇదే సందర్భంలో బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని కూడా పలు వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ఆంజనేయ స్వామి దయతో ప్రజలందరూ చల్లగా ఉండాలి

గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా

ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన సర్పంచ్ దయానంద్ గుప్తా



**కొత్తూర్ మే 12 (ప్రజా జ్యోతి):** ఆంజనేయ స్వామి దయతో ప్రజలందరూ చల్లగా ఉండాలని గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా అన్నారు.హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామంలో హనుమాన్ దేవాలయంలో సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పిఎస్సీఎస్ చైర్మన్ పద్మారావు,మాజీ సర్పంచ్ బ్యాగరి సత్తయ్య,మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దు గౌడ్,వార్డ్ సభ్యులు గట్టు లక్ష్మి చంద్రయ్య,అరవింద్ గౌడ్,దేవేందర్,గ్రామస్తులు మల్లేష్,గుండు కుమార్,గుండు బాలయ్య,ఉప్పల రాజు,ఉప్పల మనోహర్,ఉప్పల రాఘవేందర్, గట్టు శివ లింగం,పోచయ్య, మధుసూదన్ రెడ్డి, కుమార్ గౌడ్,ఉప్పల రాజు,కాంత రెడ్డి,బిజెపి నాయకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి మహోత్సవంలో పాల్గొన్న జనసేన నాయకులు ప్రేమ కుమార్



**కూకట్ పల్లి, మే 12 (ప్రజా జ్యోతి) :** కూకట్ పల్లి నియోజకవర్గం, అల్లాపూర్ డివిజన్ వివేకానంద నగర్ లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం కమిటీ చైర్మన్ ఆహ్వానం మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కో ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ హనుమాన్ జయంతి సందర్భంగా జరిగిన ప్రత్యక పూజలలో, భజన కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నప్రసాద వితరణ కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రేమకుమార్ ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, బండారు ప్రసన్నాంజనీయలు, తుంగం శ్రీనివాస్ రావు, బొల్లి శ్రీనివాస్ రావు, పవన్, తుంగ రామారావు, జల్ల రవి, ఆర్.జగన్నాథం, మధు, దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# లీకేజీల ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

-నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర సర్కార్ విఫలం

-విద్యార్థుల ఆశలను ఆవిరి చేసిన బిజెపి ప్రభుత్వం

-తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూర్ మే12 ప్రజా జ్యోతి:-** విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ పరీక్ష నిర్వహణలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. వరుసగా జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకేజీలను ప్రోత్సహిస్తున్న బిజెపి సర్కార్ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని హెచ్చరించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించడంతో ఎంతో కష్టపడి చదివిన విద్యార్థుల ఆశలను ఆశయాలను నేరుగార్చిందని ధ్వజమెత్తారు. అటు తల్లిదండ్రుల్లో ఇటు విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎన్నో సంవత్సరాలుగా శ్రమించి పరీక్షలకు సిద్ధమై పరీక్షలు పూర్తయ్యాయి కదా అంటూ ఊపిరి పీల్చుకున్న ఇంతటి ఘోరమైన నిర్ణయం తీసుకుంటుందని ఊహించలేదని విద్యార్థుల్లో ఆందోళన మొదలైనట్లు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును నిర్మించే యువత జీవితాలతో రాజకీయాలు చేయకుండా, కేంద్ర ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల నమ్మకాన్ని కాపాడాలంటే నీట్ పరీక్ష వ్యవస్థలో పూర్తి పారదర్శకత, భద్రత, జవాబుదారీతనం తీసుకురావడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అలాగే సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి అన్నారు.

నీట్ పరీక్ష పత్రాలు లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలని కోరారు. ఇలాంటి తప్పిదాలకు చోటు ఇవ్వకుండా పరీక్ష నిర్వాహణలో పూర్తి పారదర్శకత పాటించాలని కోరారు.

# తాండూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

-రౌడీ షీటర్లు అనుమానితులపై నిఘా పెట్టాలి

-స్టేషన్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలిన

-ప్రజల భద్రతపై నిర్లక్ష్యం చేయొద్దు

-పెండింగ్ కేసులపై నివేదిక ఇవ్వాలి

-దొంగతనాల కేసులో పురోగతిపై ఆరా

-రానున్న బక్రీద్ పండగను ప్రశాంతంగా జరిగేలా చూడాలి

-మత పెద్దలతో శాంతి సభ నిర్వహించాలి

-జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా







**తాండూరు మే 12 ప్రజా జ్యోతి :-** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మంగళవారం రోజు తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ పోలీస్ స్టేషన్‌లోని పలు కీలక రికార్డులు , క్రైమ్ రిజిస్టర్లు పరిశీలించిన ఎస్పీ పెండింగ్ కేసుల స్థితిగతులను ఆమె నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని పోలీస్ శాఖ ఉన్నత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పట్టణంలో ఇదివరకు జరిగిన దొంగతనాల కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిందితులను పట్టుకుని కేసుల పురోగతి సాధించాలని ఆదేశించారు.

అలాగే రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని తాండూర్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ స్పష్టం చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా స్థానిక మత పెద్దలు, ప్రముఖులతో తక్షణమే పీస్ కమిటీ (శాంతి కమిటీ) సమావేశాలను ఏర్పాటు చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కమ్యూనల్ అంశాలకు సంబంధించి పాత నేరస్తులు, రౌడీ షీటర్లు అనుమానితులపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అవసరమైతే కౌన్సిలింగ్ నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కేసుల దర్యాప్తులో ఏమాత్రం జాప్యం జరగకుండా పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారు లతో మర్యాదగా ప్రవర్తించి సమస్యలను పరిష్కరించడం కోసం కృషి చేయాలన్నారు. దీంతో ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందన్నారు.

ఈ తనిఖీ తాండూర్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, స్థానిక పోలీస్ అధికారులు సిబ్బంది ఉన్నారు.

# కర్మాన్ ఘాట్ హనుమాన్ దేవాలయ దర్శనానికి పోటెత్తిన భక్తజనం





– హనుమజ్జయంతి సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ

**రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి:** వైశాఖ బహుళ దశమి హనుమజ్జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం 5 గంటల నుంచే భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి చేరుకుని శ్రీ స్వామివారికి సింధూరాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు సుమారు 60 వేల మందికి పైగా భక్తులు దర్శనానికి వచ్చినట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూ లైన్లు, చలువ పందిళ్లు, మంచినీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదాల పంపిణీ వంటి ఏర్పాట్లు చేపట్టారు. దర్శనం, అర్చనలు, ప్రసాదాల కౌంటర్ల వద్ద ఇబ్బందులు లేకుండా అదనపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు.

ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీమతి ఎన్. లావణ్య, చైర్మన్ వీధులకంటి సత్యనారాయణ రెడ్డి, ధర్మకర్తలు మరియు ఆలయ సిబ్బంది ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు దిండు ప్రవీణ్ కుమార్ గౌడ్ తోకటి కిరణ్ కుమార్ సింగంశెట్టి శ్రీనివాస్ జానుపల్లి విష్ణువర్ధన్ రెడ్డి కుకునూరి గోపాల్ రెడ్డి పూలనాగరాజు శ్రీమతి కే కవిత ఓరుగంటి సురేష్ కొండసంతోష్ కుమార్ బండిగారి శ్రీనివాస్ గౌడ్ ఎనుముల రవీందర్ రెడ్డి శ్రీమతి ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

## ఓటర్ల జాబితా రూపకల్పనలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్ మే 12(ప్రజా జ్యోతి ):**కుత్బుల్లాపూర్: 129 డివిజన్ పరిధిలోని టీఎస్ఎస్సి కాలనీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఓటర్ల ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ – (ఎస్ ఐ ఆర్ )కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ మరియు డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ లతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద పార్టీ నాయకులు మరియు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ పలు కీలక సూచనలు చేశారు: ఓట్ల మ్యాపింగ్: ఓట్ల మ్యాపింగ్‌కు సంబంధించి బూత్ ఇన్చార్జిలు, బీఎల్ఓ (బి ఎల్ ఓ )లతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పక్కాగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ వెరిఫికేషన్: బస్తీలలో గడపగడపకు బీఎల్ఓలు ఓటర్ వెరిఫికేషన్ చేస్తున్న సమయంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు సహకరించాలని కోరారు. అభివృద్ధి ఎ సంక్షేమం: రాబోయే రోజుల్లో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, అభివృద్ధి పథంలో నియోజకవర్గాన్ని ముందుంచేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ నాయకులు, వివిధ బస్తీల వెల్ఫేర్ కమిటీ సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, మహిళా ప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గాజులరామారంలో భారీ అగ్నిప్రమాద స్థలాన్ని సందర్శించిన ఎంపీ ఈటల రాజేందర్



**కుత్బుల్లాపూర్ మే 12(ప్రజా జ్యోతి ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సేల్ కో కన్వీనర్ రావుల శేషగిరి కుత్బుల్లాపూర్ గాజులరామారం డివిజన్ పరిధిలోని మహాదేవపురంలో జరిగిన భారీ అగ్నిప్రమాద స్థలాన్ని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, నష్టపోయిన బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ పర్యటనలో ఈటల రాజేందర్ పాటు లిజిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి , కేకేపి బిజెపి కాంతారావు ,స్టేట్ కౌన్సిల్ సభ్యులు బక్క శంకర్ రెడ్డి , తెలంగాణ రాష్ట్రం మున్సిపల్ సెల్ కో కన్వీనర్ గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అంతర్జాతీయ నర్సుల దినోత్సవము

## –తాడి బోయిన రామస్వామి

**లింగంపల్లి,మే 12 (ప్రజాజ్యోతి):** లింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమీపంలో గల పద్మా అపార్ట్ మెంట్ లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి క్రొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఆర్. పుట్టరాజు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్, డిహెచ్ఈఎల్ జనరల్ హాస్పిటల్ అతిథులుగా డాక్టర్ బి.సి.రామన్న సత్యసాయి సేవాసమితి రంగారెడ్డి జిల్లా కన్వీనర్, ఇ. దేవానంద్ యాదవ్ సోషల్ వర్కర్ విచ్చేసి మాట్లాడుతూ....ప్రపంచ ఆరోగ్యసంస్థ వారు మే12వ తారీఖున ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఒక ప్రత్యేక నినాదంతో నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం మన నర్సులు మన భవిష్యత్తు సాధికారులైన నర్సులు మన ప్రాణాలను కాపాడతారు అనే నినాదంతో నిర్వహిస్తున్నారు. మానవులకు సేవ చేయడానికి భగవంతుడు కల్పించిన అవకాశమే వైద్య రంగం. దీనిలో ప్రధానమైంది నర్సింగ్ వృత్తి. రోగులకు వైద్యులు యిచ్చే ఔషధం ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవకూడా అంతే ముఖ్యం అని అన్నారు. దీపంలాగా వెలిగాయి. రోగులకు కావలసిన మందులు,పరికరాలు పంపమని ప్రభుత్వానికి అర్జీలు పంపేది. రోగులకు ఆసుపత్రులలో చోటు సరిపోకపోతే అధికారులను ఒప్పించి పాత యిళ్ళను, భవనాలను ఆసుపత్రులుగా మార్చేది. త్రాగుడుకు డబ్బులు కర్చు పెట్టకండి. ఆ డబ్బులను మీ



యింటికి పంపిస్తే యిల్లు గడుస్తుంది కదా అని హితబోధ చేసేది. గ్రంథాలయాలు,చదువుకునే గదులు అందరికి అందుబాటులో ఉండేటట్లు చూసి అక్షరాస్యతను పెంచింది. నోట్స్ ఆన్ హాస్పిటల్స్, నోట్స్ ఆన్ నర్సింగ్ అనే గ్రంథాలను వ్రాయడమే కాక, విక్టోరియా రాణికి అలాగే ప్రభుత్వ అధికారులకు హాస్పిటల్స్ బాగు కొరకు అభ్యర్థనలు పంపేది. నాటి నుండి నర్సింగ్ వృత్తికి ప్రత్యేకంగా శిక్షణ యివ్వడం ప్రారంభం అయింది. 1860వ సంవత్సరం జూన్ 24 న ట్రైనింగ్ స్కూల్ ఫర్ నర్సెస్ అనే సంస్థను లండనులో స్థాపించింది. ఆమెను మదర్ ఆఫ్ మోడ్రన్ నర్సింగ్' గా గుర్తించారు. ఆవిడ భారతదేశానికి కూడా యితోధిక సేవలు అందించారు. 1859వ సంవత్సరంలో విక్టోరియా రాణి ఆరోగ్య సంస్కరణల కొరకు ఒక కమీషన్ ను నియమించింది. ఫ్లోరెన్స్ నైటింగేల్ సూచనలు, సలహాల మేరకు భారతదేశంలో శానిటరీ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దాని వల్ల మరణాల రేటు కూడా గణనీయంగా తగ్గడం జరిగింది. ఫ్లోరెన్స్ నైటింగేల్ మరలా పుట్టి నేటి ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితులను మెరుగు పరచాలని కోరుకుందాం. సేవానిరతి గల ప్రతి నర్సులోనూ ఆమె జీవించి ఉంటుంది. నర్సులు, రోగులు గుర్తుంచుకోవలసిన ఆదర్శమూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ అని కొనియాడారు. నైటింగేల్ నర్సింగ్ వృత్తికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆవిడ జన్మదినమైన మే12వ తారీఖునాడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం అని అన్నారు. నేటి యువ నర్సులు ఆవిడ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలి అని కోరారు. కనిపించే దేవుళ్ళు వైద్యులైతే కాపాడే దేవతలే నర్సులు అని కొనియాడారు. తదనంతరం నర్సులచేత ' రోగులకు అంకితభావంతో మెరుగైన సేవలు అందిస్తాం అని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా మానవసేవే మాధవసేవగా భావించి వివిధ ప్రభుత్వ వైద్యశాలలో (నిమ్స్, లింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,రంగారెడ్డి జిల్లా ఆసుపత్రి, కొండాపూర్, ఏరియా హాస్పిటల్, పటాన్ చెరు, ఈఎస్ ఐ హాస్పిటల్, రామచంద్రాపురం,బీహెచ్ఈఎల్ జనరల్ హాస్పిటల్, హాఫీజ్ పేట అర్బన్ హెల్త్ సెంటర్, హెచ్ సి యు హెల్త్ సెంటర్,ఉర్దూ యూనివర్శిటీ హెల్త్ సెంటర్,సరోజినీ దేవి కంటి ఆసుపత్రి, ఉస్మానియా జనరల్ హాస్పిటల్) రోగులపట్ల ప్రేమానురాగాలు చూపిస్తూ వైద్య సేవలందించిన సేవామూర్తులైన 80 మంది నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుతో పాటు శాలువ,జ్ఞాపిక, పగిడిలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం ఈ. దేవానంద్ యాదవ్ సౌజన్యంతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందూరి వెంకటేశ్వర రాజు,అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, జి.వి.రావు, సత్యనారాయణ, వాణిసాంబ శివరావు, విజయలక్ష్మీ ,విష్ణుప్రసాద్, బాలాజీ, శివరామిరెడ్డి ,వెంకటేశ్వర్లు,పాండు, తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించిన భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ విద్యార్థికి 50,000 నగదు ప్రోత్సాహాన్ని అందచేసిన భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

– విద్యార్థుల ప్రతిభ ను ప్రోత్సహిస్తూ ఘన సన్మానం, అభినందన సభ

**కుత్బుల్లాపూర్ మే 12(ప్రజా జ్యోతి ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ లోని ప్రభుత్వ పాటశాలలో ఈరోజు భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 10వ తరగతి లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా లోనే మొదటి స్థానం సంపాదించిన విద్యార్థికి మరియు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం, అభినందన సభ నిర్వహించడం జరిగింది.

ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి తమ తల్లిదండ్రులకు, పాఠశాలలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించి, నగదు పురస్కారాన్ని అందచేసారు. ముఖ్యంగా భౌరంపేట్‌కు చెందిన ఒక విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం పట్ల కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి లక్ష్మీ నారాయణకు రూ.50,000 నగదు పురస్కారం అందజేశారు. అలాగే మండల స్థాయిలో 3వ ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.30,000 నగదు బహుమతిని ప్రదానం చేశారు. అదేవిధంగా 500 పైగా మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున, 490 పైగా మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున నగదు పురస్కారాలను అందజేసి వారి ప్రతిభను కొనియాడారు.



అనంతరం వారు మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడం భౌరంపేట్ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. మీరు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాటశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి , నాయకులు మన్నే శేఖర్ ముదిరాజ్ , మిద్దెల మల్లారెడ్డి , కటకం విరేష్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా బాటలో ఏఈ పర్యటన -- సురంగల్ 14వ వార్డులో విద్యుత్ సమస్యల పరిశీలన

త్వరలో బడ్జెట్ కేటాయించి సమస్యల పరిష్కారం చేస్తాం డీఈ రమేష్ చంద్ర

**మొయినాబాద్, మే 7( ప్రజా జ్యోతి):** విద్యుత్ శాఖ చేపట్టిన “ప్రజా బాట” కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మండల ఏఈ బానోతు హేము మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ 14వ వార్డులో పర్యటించి విద్యుత్ సమస్యలను పరిశీలించారు. 14వ వార్డు కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన నిర్వహించబడింది.



ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీధర్ వార్డులోని ప్రజలు మరియు రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వార్డులో దాదాపు 15 విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, పలు బోరుబావులకు సరైన విద్యుత్ సరఫరా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఏఈ బానోతు హేము ప్రతి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి నమోదు చేసుకున్నారు. అనంతరం కౌన్సిలర్ శ్రీధర్ డీఈ రమేష్ చంద్రకు ఫోన్ ద్వారా వివరాలు తెలియజేసి, సమస్యల పరిష్కారానికి తక్షణమే బడ్జెట్ కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన డీఈ రమేష్ చంద్ర, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేకల రామచంద్రయ్య, ఎల్లని అశోక్ గౌడ్, సోమ వెంకటేష్, ఎల్లని సాయి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన బండి రమేష్

**కూకట్ పల్లి, మే 12 (ప్రజా జ్యోతి) :** కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ని సంప్రదించారు. కూకట్ పల్లి నియోజకవర్గం లోని మూసాపేట్ డివిజన్ కి చెందిన జంగం ప్రశాంత్ తండ్రి బిక్షపతి కి రూ.60,000 రూపాయల చెక్కు, తల్లారి మమత, సురేష్ కి రూ.60,000 చెక్కులు మంజూరైనవి. ఇట్టి చెక్కులు కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి టిపిసిసి ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిదికి ధరకాస్తూ చేసుకోగ 1,20,000/- రూపాయలు మంజురు అయినవి. అట్టి చెక్కులను బండి రమేష్ చేతులమీదుగా మంగళవారం కూకట్ పల్లి నియోజకవర్గం శ్రీ హేమ దుర్గ భవన్ లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గాలి బాలాజీ, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, విటల్ రెడ్డి, కనకయ్య, అస్లాం, అరవింద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, బండి రమేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

– ప్రతి శనివారం హనుమాన్ చాలీసా పారాయణాన్ని వినాలి

**శేరిలింగంపల్లి,మే 12 (ప్రజాజ్యోతి):** హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మియాపూర్ మక్త మహబూబ్‌పేట్ హనుమాన్ టెంపుల్‌లో నిర్వహించిన శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం భక్తుల గోవింద నామస్మరణలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. కాలనీ వాసులు, యువత, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి భావంతో పారాయణం నిర్వహించి శ్రీ ఆంజనేయ స్వామివారి కృపాకటాక్షాలను పొందారు. సంకటమోచనుడు ఆంజనేయ స్వామివారి ఆశీస్సులు ప్రతి ఇంటిపై ఉండాలని అలాగే ప్రతి శనివారం సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించబడుతుందని, కావున భక్తులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు, గ్రామస్తులు కోరారు..



## శ్రీ బాల ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు


పాల్గొన్న రాష్ట్ర బీసీ నాయకుడు తేళ్ల హరికృష్ణ

కూకట్ పల్లి, న్యూస్ మే 12 (ప్రజా జ్యోతి) : హనుమాన్ జయంతి పురస్కరించుకొని కూకట్ పల్లిలోని బగ్ అమీర్ లో ఉన్న శ్రీ బాల ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ నాయకుడు తెల్ల హరికృష్ణ హాజరై విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షులు ఆకుల లక్ష్మణరావు, రమణ పంతులు బృందం, ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.



## విద్యా వ్యవస్థను బలోపేతనము చేయాలి :డాక్టర్ కె నారాయణ

**శేరిలింగంపల్లి, మే 12 (ప్రజాజ్యోతి):** దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన నీట్ పరీక్ష మరోసారి దేశ విద్యా వ్యవస్థలోని తీవ్రమైన లోపాలను బయటపెట్టింది. ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలు దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బతీశాయి. లక్షలాది మంది పరీక్ష రాస్తే, అందుబాటులో ఉన్న సీట్లు కేవలం సుమారు 1.30 లక్షలే ఉండటం తీవ్ర ఒత్తిడి, అన్యాయ పరిస్థితులకు దారితీస్తోంది. లక్షలాది మంది విద్యార్థులు,వారి తల్లిదండ్రులు అవమానాలు, ఆందోళనలు,తీవ్రమైన మానసిక వేదనను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు ప్రోత్సహించిన ప్రైవేట్ కార్పొరేట్ విద్యా వ్యవస్థ విద్యను వ్యాపారంగా మార్చి,విద్యార్థులను లాభాల కోసం ఉపయోగించే పరిస్థితి తీసుకొచ్చింది. ఈ పరిస్థితి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో,పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి అని సిపిఐ డిమాండ్ చేస్తోంది. ప్రశ్నాపత్రాల లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ శక్తులపై నియంత్రణ విధించాలి. సిపిఐ డిమాండ్లు..నీట్ పరీక్ష రాసిన విద్యార్థులందరికీ పరిహారం చెల్లించాలి.



అనారోగ్యకరమైన పోటీ, విద్యా వ్యాపారీకరణను ప్రోత్సహిస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై నిషేధం లేదా కఠిన నియంత్రణలు అమలు చేయాలి. పారదర్శకమైన, విద్యార్థి కేంద్రిత ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని డాక్టర్ కే నారాయణ అన్నారు.

## పాపిరెడ్డి నగర్‌లోని అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ బస్తి వాసుల ఆగ్రహం

తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

**కూకట్ పల్లి, మే 12 (ప్రజా జ్యోతి) :** కూకట్ పల్లి మండల్ వెంకటేశ్వర నగర్ డివిజన్ లోని పాపిరెడ్డి నగర్ లో అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లను తొలగించి నిర్వహకులపై చర్యలు తీసుకివాలని బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి బస్తి వాసులతో కలిసి మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అక్రమ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి విక్రయిస్తూ నీటి సంక్షోభానికి పాల్పడుతున్న వ్యక్తులకు అధికారులు సహకరిస్తున్నారాని ఆరోపించారు. నీటి వనరులు దోచేస్తూ అక్రమ వ్యాపారం చేస్తూన్న వ్యక్తుల కోసం బస్తి లోని ప్రజలకు నీళ్ల ఇబ్బందులను సృష్టించడం సబబు కాదన్నారు. ఇదే విషయమై గత కొంత కాలంగా వివిధ విభాగాల అధికారులకు వినతులు అందిస్తూ సమస్యను పరిష్కరించాలని బస్తి వాసుల విజ్ఞపులను పక్కనపెట్టి అక్రమ వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు సహకరించడం దురదృష్టకరమన్నారు. నీటి ఎద్దడికి కరణమవుతున్న వ్యక్తులపై స్థానిజ ప్రజాప్రతినిధులు, అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా బస్తి వాసుల సమస్యను గుర్తించి భూగర్భ నీటిని తోడేస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్న వాటర్ ప్లాంట్లను తొలగించి సమస్యను పరిష్కరించాలంటూ తహశీల్దార్ కార్యాలయం సూపర్డెంట్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ బస్తివాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## హనుమాన్ జయంతి ప్రత్యేక పూజలు మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు

**ఉప్పల్, మే 12, ప్రజా జ్యోతి :** శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం శ్రీనగర్ కాలనీలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దైవ భక్తి మనసుకు ప్రశాంతతను, జీవితానికి సానుకూల దృక్పథాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనతో ముందుకు సాగితే సమాజంలో సౌహార్ద వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. అనంతరం భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొని, ప్రజలందరికీ శ్రీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఓబీసీ ప్రెసిడెంట్ వేముల తిరుపతయ్య, గడ్డం సాయికిరణ్, రాంబ్రహ్మం, పెంటమ్ శైలేందర్, ఎంఎస్ యాదవ్, సందీప్ పటేల్, యాదగిరి రెడ్డి, రాపోలు సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.





# 50 సార్లు రక్తదానం చేసిన కౌన్సిలర్ ప్రభాకర్ యాదవ్‌కు సన్మానం

- తలసేమియా సిక్కిల్ సెల్ సంస్థ ఆధ్వర్యంలో స్మారక చిహ్నం ప్రదానం

**మొయినాబాద్, మే 12(ప్రజా జ్యోతి):** శివరాంపల్లిలోని తలసేమియా సిక్కిల్ సెల్ సంస్థ ఆధ్వర్యంలో మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని యెన్కెపల్లి 9వ వార్డ్ కౌన్సిలర్ ముదిగొండ ప్రభాకర్ యాదవ్ ను ఘనంగా సన్మానించారు. సమాజ సేవలో భాగంగా ఆయన ఇప్పటివరకు 50 సార్లు రక్తదానం చేసి అనేకమంది ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషించినందుకు గుర్తింపుగా సంస్థ ప్రతినిధులు స్మారక చిహ్నాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ప్రతి ఒక్కరికీ లభిస్తుందని, యువత ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. తలసేమియా బాధితులకు నిరంతరం రక్తం అవసరం అవుతుందని, అందుకే సమాజంలో రక్తదానంపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

తనకు ఈ గౌరవం అందించిన తలసేమియా సిక్కిల్ సెల్ సంస్థ ప్రతినిధులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు మరియు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



## కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కొండగట్టు ఆంజనేయ స్వామివారిని దర్శించుకోవడం జరిగింది



**కుత్బుల్లాపూర్ మే 12(ప్రజా జ్యోతి ):** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ హనుమాన్ జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకోవడం జరిగింది. అనంతరం శ్రీశైలం గౌడ్ తనయుడు కూన కృష్ణ గౌడ్ హనుమాన్ మాలవిరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు స్థానిక ఆలయ పండితులు ఆశీర్వచనాల అందించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## చిల్కూర్ ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ

గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి దిశగా మరో ముందడుగు




**మొయినాబాద్, మే12( ప్రజా జ్యోతి):** చిల్కూర్‌లోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచితంగా మగ్గం వర్క్ శిక్షణ అందించనున్నట్లు సంస్థ సంచాలకులు మొహమ్మద్ అలీ ఖాన్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం 13.05.2026 నుండి ప్రారంభం కానుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన గ్రామీణ మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని




వినియోగించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు ఈ శిక్షణకు అర్హులు. మొత్తం 30 రోజులపాటు నిర్వహించబడే ఈ శిక్షణలో మగ్గం వర్క్‌పై ప్రాక్టికల్ మరియు సాంకేతిక పరిజ్ఞానం అందించబడుతుంది. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి, భోజన సౌకర్యం, యూనిఫాం మరియు టూల్ కిట్లు కూడా ఉచితంగా అందజేయబడతాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 12.05.2026 నుండి సంస్థ కార్యాలయంలో లేదా ఫోన్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు గాజ మెమో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు మరియు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు సమర్పించాల్సి ఉంటుంది. వివరాలకు: 8500165190 చిరునామా: SBIRSETI, చిల్కూర్

## హస్తినపురం లో బాలుడి పై వీధి కుక్కల దాడి తీవ్ర గాయాలు



**రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి:** హస్తినాపురం డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేస్-2లో అపార్ట్మెంట్ సెల్లార్‌లో ఆడుకుంటున్న అద్విక్ అనే బాలుడిపై ఎనిమిది వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు బాలుడిని వెంటనే కామినేని ఆస్పత్రికి తరలించారు. ఘటన విషయం తెలుసుకున్న బీజేపీ ఎల్‌బీనగర్ అసెంబ్లీ ఇంచార్జి సామ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డితో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్య నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసినారు వెటర్నరీ అధికారులతో మాట్లాడి వీధి కుక్కల బెడదను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్ భువనగిరి శ్రీనివాస్ ను కలిసి బాలుడి చికిత్స ఖర్చును జీహెచ్ఎంసీ భరించాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ రాజు గౌడ్ కృష్ణం రాజు సురేష్ తదితరులు పాల్గొన్నారు

## హనుమాన్ జయంతి సందర్భంగా చందన అర్చన కార్యక్రమాలు

జక్కిడి రఘువీర్ రెడ్డి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు



**రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి:** హనుమాన్ జయంతి సందర్భంగా మన్సూరాబాద్ చౌరస్తాలోని శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని ఆంజనేయ స్వామివారి ఆశీస్సులు పొందారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పోచబోయిన జగదీష్ యాదవ్ నాంపల్లి రామేశ్వర్ పోచబోయిన రఘు యాదవ్, జక్కిడి అభిలాష్ రెడ్డి పోచబోయిన సురేష్ యాదవ్ కేశబోయిన నగేష్ యాదవ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు

# నారాయణ విద్యా సంస్థల బరితెగింపు!







- విద్యాశాఖ నిబంధనలకు పాతర
- విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు తూట్లు
- నిద్రమత్తులో విద్యాశాఖ అధికారులు?
- పాఠశాలకు అనుమతులకు ఆమోదం లేకున్నా అక్రమ అడ్మిషన్లు
- నారాయణ యాజమాన్యానికి నోటీసు జారీ

*"విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలకు సంబంధించి ఫీజుల చెల్లింపులో కాస్త ఆలస్యం జరిగితే వేధింపులకు గురిచేసే ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యాశాఖ నిబంధనలకు పాతరెస్తూ అక్రమంగా అడ్మిషన్లను చేపడుతూన్నారు. అంతేకాకుండా విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కి పాఠశాలలకు అనుమతులు పొందకుండానే అక్రమ అడ్మిషన్ల దందాకు తెరలేపారు. ఇంత జరుగుతున్నా అనుమతులు లేని సదరు విద్యాసంస్థలు అడ్మిషన్ల కోసం పాట్లు పడుతుంటే వాటిని అరికట్టి కఠిన చర్యలు తీసుకోవాల్సిన మేడ్చల్ మండల, జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు ప్రైవేటు విద్యా సంస్థలతో కుమ్మక్కై చర్యలు తీసుకోవడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి."*

**మేడ్చల్, మే 12 (ప్రజాజ్యోతి):** విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కుతూ మేడ్చల్ లోని నారాయణ పాఠశాల యాజమాన్యం ఒక అడుగు ముందుకేసి అక్రమ అడ్మిషన్ల దందాకు తెరలేపింది. విద్యాశాఖ నిబంధన ప్రకారం పాఠశాలకు సంబంధించిన అనుమతులు పూర్తిస్థాయిలో ఆమోదం పొందాకే అడ్మిషన్లు తీసుకోవాల్సి ఉండగా, నారాయణ పాఠశాల యాజమాన్యం మాత్రం విద్యాశాఖ నిబంధనలను డోంట్ కేర్ అంటూ అడ్మిషన్లు చేపడుతున్నారు. అమాయకపు విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుండి వేలల్లో డబ్బులు తీసుకొని అడ్మిషన్లు చేపడుతున్నారని యుఎస్ఎస్ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ ఆరోపించారు. పాఠశాలలో పూర్తిస్థాయి తరగతి గదుల నిర్మాణం, విద్యా బోధనకు ఏర్పాట్లు పూర్తవ్వకుండానే నారాయణ పాఠశాల యాజమాన్యం అడ్మిషన్లను సేకరించడమే విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఉదాహరణగా చెప్పొచ్చని అన్నారు. నారాయణ పాఠశాల సహా మేడ్చల్ మండలంలో మరికొన్ని ప్రైవేటు పాఠశాలలు ఇదే తరహాలో అక్రమంగా అడ్మిషన్లను చేపడుతుంటే విద్యాశాఖ అధికారులు పూర్తి పర్యవేక్షణ చేసి విచారణ జరిపి చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనక్కి తగ్గుతున్నారని విద్యాశాఖ అధికారులను యుఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశ్నిస్తున్నారు. నారాయణ పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని అమాయక విద్యార్థుల తల్లిదండ్రులు ఆ పాఠశాలలో వారి పిల్లలకు అడ్మిషన్లు తీసుకొని మోసపోకుండా ఉండాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా అడ్మిషన్లు చేపట్టిన నారాయణ విద్యా సంస్థల యాజమాన్యంపై పూర్తి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని యుఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలు పాఠశాల వద్ద ఆందోళన చేపడుతూ పాఠశాలకు అనుమతులు లేకుండా ఎలా అడ్మిషన్లు తీసుకుంటారని విద్యాశాఖ అధికారులను అడిగితే అప్పటివరకు పాఠశాలకు ఎలాంటి నోటీసు విద్యాధికారులు ఇవ్వకపోవడం విచిత్రమని యుఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. చర్యలు తీసుకోవడంలో జాప్యం జరిగితే ఎంఈఓ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు.

**విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు తూట్లు**

అమాయక విద్యార్థుల తల్లిదండ్రులను టార్గెట్ చేసి మేడ్చల్లోని నారాయణ పాఠశాల యాజమాన్యం అక్రమంగా అడ్మిషన్లను తీసుకుంటూ, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలల్లో డబ్బులు కాజేస్తున్నారు. అనుమతులు పొందిన తరువాతే అడ్మిషన్లు తీసుకోవాల్సి ఉండగా, విద్యార్థుల తల్లిదండ్రులకు మాయ మాటలు చెబుతూ తమ విద్యా సంస్థకు అనుమతులు ఉన్నాయని అడ్మిషన్లను తీసుకుంటున్నారని సమాచారం. తొందరపాటులో నారాయణ పాఠశాల యాజమాన్యం చెప్పిన మాటలు నమ్మి తల్లిదండ్రులు వారి పిల్లలకు అడ్మిషన్ తీసుకొని తర్వాత అనుమతులు రాకుంటే విద్యార్థులు, తల్లిదండ్రుల పరిస్థితి ఏంటని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు చెప్పే మాటలు నమ్మకుండా అడ్మిషన్లు తీసుకునే ముందు అనుమతులు ఉన్నాయో.. లేవో కనుక్కున్నాకే అడ్మిషన్లు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు సూచిస్తున్నారు.

**నారాయణ యాజమాన్యానికి అధికారుల నోటీసు**

జిల్లా విద్యాశాఖ అధికారి నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపడుతూ, పుస్తకాలు ఎలా అమ్ముతున్నారని యాజమాన్యాన్ని నోటీసులో ప్రశ్నించారు. విద్యాశాఖ నుండి పూర్తిస్థాయిలో అనుమతులు ఆమోదం పొందకుండా అనధికారికంగా అడ్మిషన్లను చేపట్టడం, పుస్తకాలు అమ్మడం విద్యాశాఖ నిబంధనల ప్రకారం నేరంగా భావించి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. నారాయణ పాఠశాల యాజమాన్యంపై ఎందుకు పోలీసు కేసు నమోదు అలాగే చట్టపరమైన చర్యలు తీసుకోకూడదొ సవివరంగా యాజమాన్యం సమాధానం ఇవ్వాలని నోటీసులో పొందుపరిచారు. లేదంటే నిబంధనల ప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే చర్యలు ఉంటాయని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యాన్ని నోటీసులో హెచ్చరించారు. నోటీసు జారీ చేసిన అనంతరం అడ్మిషన్లు చేపడుతున్న పాఠశాలలోని పలు గదులను విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్ సీజ్ చేశారు.

## ఎన్ జి ఆర్ ఐ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజ లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్, మే 12, ప్రజా జ్యోతి :** హనుమాన్ జయంతి సందర్భంగా హబ్సిగూడ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయస్వామి ఆశిస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజల పైయి ఉండాలని ఆకాంక్షించారు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమం లో (ఈ ఓ ) కార్యనిర్వహణ అధికారి వెంకన్న, బజారు పాండ్డు గౌడ్,దేవాలయ కమిటీ సభ్యులు బికుమల్లా అంజయ్య గుప్తా ,ఈగ అంజనేయులు తుమ్మల దేవి రెడ్డి ,బుసం రఘునాథ్ రెడ్డి,వర్కాల మదన్ గౌడ్ ,కడప నర్సింగ్,కిషన్ నాయక్,సంతోష్ కుమార్,రవి శర్మ కాంగ్రెస్ నాయకులు కంది శ్రవణ్ రెడ్డి ,రాజన్న,మాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు

## సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల మే 12(ప్రజా జ్యోతి):**ఉత్తరాంధ్రల ఆరాధ్యదైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి చందన ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పిఏసిఎస్ చైర్మన్లు, సర్పంచులు, సీనియర్ నాయకులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## వైద్య వ్యవస్థలో నర్సుల సేవలు కీలకం

-సీఈవో ఐనీష్ మర్చంట్, డా. గీత





**మేడ్చల్, మే 12 (ప్రజాజ్యోతి):** వైద్య సేవలో నర్సుల పాత్ర ఎంతో కీలకమని మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డాక్టర్ గీత అన్నారు. మంగళవారం ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి ఘనపూర్ లోని మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవంకి వారం రోజుల ముందు నుండే నర్సుల కోసం పలు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఆటల పోటీలను నిర్వహించడం జరిగిందని మిమ్స్ యాజమాన్యం తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన నర్సులకు బహుమతులను ప్రధానం చేసామని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ గీత, మెడిసిటీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఈవో ఐనీష్ మర్చంట్ మాట్లాడుతూ.. ఆస్పత్రులలో నర్సులు చేసే సేవలు రోగంతో బాధపడుతున్న వారికి ఎంతో స్వాంతన చేకూర్చేలా ఉండాలని సూచించారు. వైద్యులు ఇచ్చే మందుల కన్నా నర్సులు చేసే ప్రేమాభిమానాలు పలు సందర్భాలలో రోగం నయం కావడానికి దోహదపడతాయని అన్నారు. వైద్య సేవలలో నర్సుల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. రోగి ఆసుపత్రిలో చేరినప్పటి నుండి తిరిగి వెళ్లే వరకు వారు చేసే సేవలు ఎనలేనివని కొనియాడారు. రోగి చికిత్స పొందుతున్న సందర్భంలో నర్సులు రోగుల పట్ల కరుణతో వ్యవహరిస్తూ వారి బాధలను మరిచేలా చూడాలని సూచించారు. వైద్యరంగంలో వైద్యులు అందించే చికిత్స కన్నా 90 శాతం సేవలు నర్సులు అందించేవే ఉంటాయని, అంతటి మహోన్నత వృత్తిలో ఉండడం గర్వకారణంగా భావించాలని అన్నారు.

# భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి ఉత్సవాలు





- భక్తాంజనేయునికి భక్తుల అభిషేకాలు అఖండ హారతి
- ప్రత్యేక పూజలతో స్వామిని స్మరించుకున్న భక్తులు
- సంకల్ప ధ్వజావిష్కరణ చేసిన ఆలయ ఫౌండర్ వెంకట్
- మిన్నంటిన జై హనుమాన్ నినాదాలు, యువత ర్యాలీ

**యాచారం, మే 12 (ప్రజాజ్యోతి):** భక్తుల్లో ప్రజల్లో భక్తి పారవశ్యం సంతరించుకోగా నందివనపర్తిలో జ్ఞాన సరస్వతి సేవా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం సంకల్ప భవన్ పై ఆలయ ఫౌండర్ సదా వెంకట్ సంకల్ప ధ్వజావిష్కరణ చేశారు. భక్తాంజనేయునికి అభిషేకాలు నిర్వహించారు. పవమాన హోమం, పూర్ణాహుతి, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, అఖండ హారతి, అన్నప్రసాద వితరణ చేశారు. ప్రత్యేక పూజలతో ప్రజలు భక్తులు స్వామివారిని మరించుకున్నారు. అనంతరం సర్పంచ్ విజయ్, ఉప సర్పంచ్ శ్రీశైలం, జ్ఞాన సరస్వతి సేవా సమితి సభ్యులు జెండా ఊపి బైక్ ర్యాలీని నిర్వహించారు. జై హనుమాన్, జై జై హనుమాన్ అంటూ యువత నినాదాలు మిన్నంటాయి. నంది వనపర్తి క్షేత్ర పరిధిలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ విగ్రహాలను, దేవాలయాలను సందర్శించి పూజలు చేశారు. రాత్రి హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. జ్ఞానసరస్వతి సేవాసమితి సభ్యులు రాఘవేంద్ర శర్మ, రామనాథం, సంగెం గణేష్, చిన్న జలంధర్ రెడ్డి, నిఖిల్, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పంచాయితీ పాలక వర్గం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విద్య వారోత్సవాలు

# రెండవ రోజు ఘన విజయం

**ఉప్పల్, మే 12, ప్రజా జ్యోతి :**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా విద్య వారోత్సవాల రెండవ రోజు ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్సాహభరితంగా విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో పీజీ కోచింగ్, యోగా చ వెల్నెస్, డ్రగ్ నిరోధక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినాయి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ ఉన్నత విద్యామండలి సీసీఈ కమిషనర్ శ్రీ దేవసేన ఆధ్వర్యంలో ఐసెట్, పీజీ సెట్ ఇతర పోటీ పరీక్షలకు ప్రత్యేక ఉచిత కోచింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు నిపుణులుగా ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ విధానాల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న లింకుల ద్వారా నమోదు చేసుకొని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో పీజీ సీట్లు సాధించాలని సూచించారు.

కళాశాల ఆంగ్ల విభాగాధిపతి, యోగ రత్న డాక్టర్ జి. తిరుపతయ్య యోగా వెల్నెస్‌పై ప్రత్యేక అవగాహన కల్పిస్తూ,







"యోగ అంటే శరీరం, మనస్సు ఆత్మల సమన్వయం"అని పేర్కొన్నారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని వివరించారు. విద్యార్థులకు పలు యోగాసనాలను ప్రదర్శించి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సమతుల్య జీవనశైలి ఒత్తిడి నియంత్రణపై సవివరంగా అవగాహన కల్పించారు,డ్రగ్ నియంత్రణ కమిటీ కన్వీనర్ డాక్టర్ చంద్రసాగర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్, మత్తు పదార్థాలు, పొగాకు గుట్కా వంటి ప్రాణాంతక అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ అలవాట్లు వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలను సమాజాన్ని కూడా నాశనం చేసే ప్రమాదకర వ్యసనాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి యాంటీ డ్రగ్ ప్లకార్డ్స్‌తో కళాశాల పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు డాక్టర్ సి హెచ్ సత్యనారాయణ, డాక్టర్ తిరుపతయ్య, విశ్వనాథ్ కుమార్, గీత, డాక్టర్ యమునారాణి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ చంద్ర సాగర్ అనూష, సూర్య, అరుణ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని విద్య, ఆరోగ్యం సామాజిక బాధ్యతల పట్ల తమ చైతన్యాన్ని ప్రదర్శించారు.

## మోడీ వ్యాఖ్యలు వక్రీకరించడం సరికాదు

- కాంగ్రెస్ నేతలకు టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కౌంటర్



**శేరిలింగంపల్లి, మే 12 (ప్రజాజ్యోతి):** తెలంగాణ పర్యటనలో ప్రధాని మోదీ ప్రసంగంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం సరి కదు అని కాంగ్రెస్ నేతల తీరుపై బిజెపి టీచర్ ఎమ్మెల్సీ కొమరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.మోడీ ప్రపంచం మెచ్చిన ఓ విజనరీ లీడర్ అని అన్నారు.మోడీ పనితీరు వాళ్ళ ఈ దేశ ప్రతిష్ట తారా స్థాయికి చేరింది.అలాంటి గొప్ప నాయకుడు మోదీని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేతలకు లేదు అని అన్నారు. ఓర్వలేకనే విమర్శలు..తెలంగాణాలో బిజెపికీ, మా ప్రధాని మోదీకీ వస్తున్న ప్రజాదరణ చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతోంది అందుకే ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారు అని అన్నారు. మెట్రో, ప్రజా రవాణా వాడాలని,సోలార్ పవర్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఉపయోగించాలని మోదీ సూచించారు.ఇందులో తప్పేమి ఉంది సంక్షోభ సమయంలో దేశంలో చాలా మంది ప్రధానులుగా పని చేసిన వాళ్ళు ఇలా చాలా సార్లు మాట్లాడారు ఈ దేశ పరిస్థితులను వివరిస్తూ ప్రధానిగా నరేంద్ర మోడీ మాట్లాడితే ఎందుకు తప్పు పడుతున్నారో అర్థం కావటం లేదుమీ ప్రధానులు మాట్లాడిన సంగతి గుర్తులేదా..?నెహ్రూ, ఇందిరా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి గారు గతంలో ప్రజలకు ఇలాంటి సూచనకు చేయలేదా..? అని అన్నారు. మీ ప్రధానులు అంటే తప్పులేదా..? మోడీ ప్రజా క్షేమంకోరి చెప్తే అది తప్పా..? ఇదేం తరీఖా..?

గుడ్డుమీద ఈకలు పీకడం కాంగ్రెస్ కు అలవాటే అని అన్నారు.దక్షిణ భారత్ లో రైస్, ఉత్తర భారత్ చపాతీల వినియోగం తగ్గించాలని, ఫంక్షన్లు తగ్గించాలని గతంలో ప్రధాని నెహ్రూ మాటలు మర్చిపోయారా..? ఆర్థిక సంక్షోభం ఉన్నప్పుడు సబ్సిడీ ఎక్కువ ఇవ్వొద్దని మన్మోహన్ సింగ్ చెప్పిన సంగతి మర్చిపోయారా..?1967లో బంగారం కొనద్దని ఇందిరా గాంధీ వ్యాఖ్యలు చేయలేదా...? అని ఆయన తెలిపారు.

## ఘనంగా బేరి రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు

-పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన బేరి అభిమానులు





**శేరిలింగంపల్లి,మే 12 (ప్రజాజ్యోతి):**ఎతెలంగాణ బీసీ కులాల సంఘాల నాయకుడు, ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బీసీ ఉద్యమ నాయకుడు,బీసీల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్న బేరి రామచంద్ర యాదవ్ కు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బేరి రామచంద్ర యాదవ్ పుట్టినరోజు పురస్కరించుకొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బేరి రామచంద్ర యాదవ్ జన్మదిన సందర్భంగా పలువురు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అందరినీ ఆప్యాయంగా పలుకురించి అందరిని ఆదరిస్తున్న ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. ఆయన జన్మదినం సందర్భంగా ఆయురారోగ్యాలు ఐశ్వర్యాలతో మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని భగవంతున్ని వేడుకున్నారు బిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్, రాష్ట్ర యువజన విభాగం నాయకులు అందెల కుమార్ యాదవ్ బీసీ కులాల ఐక్యవేదిక ఆర్గనైజేషన్ సెక్రటరీ సిరిపురం హరికృష్ణ చారి, బీసీ నాయకులు నరసింహ యాదవ్, నేను రెడ్డి టెక్స్టైల్స్ బోటిక్ ప్రొప్రైటర్ కుషాల్ రెడ్డి శేరిలింగంపల్లి బీసీ సంఘం నాయకులు మనోజ్ ముదిరాజ్, మరియు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాల నాయకులు యాదవ సంఘాల నాయకులు అభిమానులు కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపినారు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అభిమానుకలకు, మిత్రులకు, స్నేహితులకు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## తార్‌బండ్ శ్రీ వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు



**బోయిన్ పల్లి: మే 12.(ప్రజా జ్యోతి):** సికింద్రాబాద్ తాడు బండ్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని ఎండోమెంట్ డిపార్ట్మెంట్ కమిషనర్ హనుమంతరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఆలయ ఈవో నరేందర్ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.



## ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ ఆశీర్వాదయాత్ర





**అబ్దుల్లాపూర్ మెట్టు మే 12 (ప్రజాజ్యోతి):** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిహెచ్ఎంసి 53,56 డివిజన్ ల బిజెపి పార్టీ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ ఆశీర్వాదయాత్రను ఘనంగా నిర్వహించారు. మునగనూరు బ్యాంక్ కాలనీ హనుమాన్ ఆలయం నుండి కోహెడగుట్ట హనుమాన్ ఆలయం వరకు హిందూ బంధువులందరూ కదలిరాగా భారీగా బైక్ ర్యాలీ చేపట్టి జై హిందు . జైశ్రీరామ్ జై హనుమాన్ అంటూ నినదీస్తూ మండుటెండను సైతం లెక్కచేయకుండా హనుమాన్ ఆశీర్వాదయాత్రను విజయవంతం చేశారు. దారి పొడవునా జై హనుమాన్ నినాదంతో ముందుకు కదలగా పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, శ్రీ అమోఘ దేశపతి హిందూ బంధువుల్లో తమ సందేశాలతో హిందూ సాంప్రదాయాల గొప్పదనాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎలిమినేటి నరసింహారెడ్డి మాట్లాడుతూ హిందువుల గొప్పదనాన్ని చాటి చెప్పేలా హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని హనుమాన్ ఆశీర్వాదయాత్ర కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, శ్రీరామ హనుమాన్ భక్తులు, యువతకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

తెలంగాణ వ్యకాసం జిల్లా అధ్యక్షుడు అంజయ్య



యాచారం, మే 12 (ప్రజాజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య అన్నారు. కురిమిద్దలో ఉపాధి హామీ కూలీలు నిర్వహిస్తున్న పనుల్ని ఆయన సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీలకు 12 వారాలుగా బిల్లులు చెల్లించడం లేదని విషయాన్ని వ్యకాసం దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 12 వారాలుగా కూలీలకు బిల్లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొంతమంది కూలీలకు పని ప్రదేశంలో ఫోటో అప్లోడ్ కాకపోవడంతో ఇంటి దగ్గరే ఉండాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కొరవడ్డాయని నీళ్లు, ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో పూర్తిగా మార్పులు చేస్తూ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. కూలీలకు రోజు రూ. 800 ఇవ్వాలని, ఏడాదిలో 200 దినాలు పని కల్పించాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ సమీక్ష సమావేశంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**ఉప్పల్, మే 12, ప్రజా జ్యోతి :** హిమాయత్ నగర్ లోని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ( టీ జి హెచ్ సి ఎల్ ) కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ సమాచార ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు ఈ సమావేశంలో డబుల్ బెడ్‌రూమ్ గృహ నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, లబ్ధిదారుల సమస్యలు భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. కాప్రా లో గల డబుల్ బెడ్ రూమ్ ల ల్లో లిఫ్ట్ లు పనిచేయడం లేదు అని అలాగే గ్రామ పంచాయతీ లే అవుట్ లు చేసి అమ్ముకుంటున్నారు అని రైతు బంధు కూడా తీసుకుంటున్నారు అని అలాగే డబుల్ బెడ్ రూం ఎంపికలో 50 స్థానికులకు కేటాయించాలి అని ఆయన అన్నారు.అలాగే డబుల్ బెడ్ రూం ల్లో సమస్యలు పరిష్కరించాలి అని ఆయన కోరడం జరిగింది.అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల కి స్థలం కేటాయించాలని కోరారు. వెంటనే మంత్రి కలెక్టర్ కు తెలియజేయడం జరిగింది. గృహ నిర్మాణాల పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు త్వరితగతిన ఇళ్లను అందించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## ఐజీ కాలనీ, చెర్లపల్లి వాసుల సమస్యలను పరిష్కరించాలి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,ఉప్పల్, మే 12, ప్రజా జ్యోతి :** సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి పత్రం అందజేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీ కాలనీ





ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముందు అడుగు వేస్తున్నారు. 2009 సంవత్సరంలో జేఎన్యూఆర్ఎం (JNNURM) పథకం కింద సుమారు 1200 ఇళ్లను నిర్మించగా, అప్పట్లో ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నదని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. దీంతో డ్రైనేజీ నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని తెలిపారు. అలాగే, 2009లో నిర్మించిన ఇళ్లలో చాలావాటిలో స్లాబ్‌లు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే



ప్రమాదం నెలకొన్నదని వాటి మరమ్మతుల కోసం కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఐజీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పరిస్థితిని వెంటనే పరిశీలించి డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణతో పాటు ఇళ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో దీ=ూ పార్టీ నాయకులు నెమూరి మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు పరుశురాం యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సాగర్ గౌడ్ , వెంకటేష్, ప్రహ్లాద్ రెడ్డి, రవి యాదవ్, వెంకటేశ్వర్ రావు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ కష్టాలు.. పట్టించుకోని అధికారులు

**చేవెళ్ల మే 12(ప్రజా జ్యోతి):** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామెన 8 వ వార్డు బీసీ కాలనీవాసులు విద్యుత్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో ఒకవైపు విద్యార్థులు కరెంట్ ఉంటే మరోవైపు విద్యుత్ నిలిచిపోతుండటంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను



పరిష్కరించాలని ఎన్నిసార్లు విద్యుత్ శాఖ అధికారులకు, ఏఈ ఎడికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. "వచ్చి చూస్తాం.. సమస్య పరిష్కరిస్తాం" అంటూ అధికారులు హామీలు ఇస్తున్నారే తప్ప పని మాత్రం చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. వేసవి వేడిలో కరెంట్ లేక నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని చెబుతున్నారు. ఇక బిల్లుల విషయంలో మాత్రం అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "కరెంట్ సరిగా ఇవ్వకుండా బిల్లులు మాత్రం నిలబెట్టి వసూలు చేస్తున్నారు" అంటూ విమర్శిస్తున్నారు. పామెన వార్డులోని బీసీ కాలనీలో కొనసాగుతున్న విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సూర్యనగర్‌లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు మాజీ కార్పొరేటర్

- పూజలు, అర్చనలు, హోమంలో భక్తుల భాగస్వామ్యం -- సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థనలు

**అల్వాల్ మే 12(ప్రజా జ్యోతి):** అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం సూర్య నగర్ లో హనుమాన్ జయంతి సందర్భంగా సూర్యనగర్‌లోని శ్రీ హనుమాన్ దేవాలయంలో భక్తి శ్రద్ధలతో వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్





రాజ్ జెథేందర్ నాథ్ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. భక్తులు హనుమంతునికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించగా, ప్రత్యేక హోమం కూడా ఘనంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమాల్లో శ్రీనివాస్ గౌడ్ స్వామి, సురేందర్ రెడ్డి, శ్రీశైలంయాదవ్, వెంకటేష్, రాజేందర్, రఘు తదితరులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ రాజ్ జెథేందర్ నాథ్ మాట్లాడుతూ, హనుమాన్ జయంతి పర్వదినం మనకు ధైర్యం, భక్తి, సేవా భావం నేర్పుతుందని తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని దేవుడిని ప్రార్థించారు. వేడుకలు భక్తి పరవశంలో సాగగా, పాల్గొన్న భక్తులు శ్రీ ఆంజనేయ స్వామి కటాక్షం అందరికీ కలగాలని కోరుకున్నారు. "శ్రీ హనుమంతుడు అందరికీ బలం, ఆరోగ్యం, సంపద, సంతోషం ప్రసాదించుగాక. జై హనుమాన్."

## భవన నిర్మాణ అనుమతులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను పరిశీలించిన జోనల్ కమిషనర్ రాధిక గుప్తా

**ఉప్పల్, మే 12, ప్రజా జ్యోతి :** ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీమతి రాధికా గుప్తా, ఐఏఎస్ మంగళవారం ఉప్పల్, బోడుప్పల్ ఘట్కేసర్ సర్కిళ్లలో ప్రత్యక్ష ఫీల్డ్ తనిఖీ నిర్వహించి, భవన అనుమతులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల అంశాలను సిటీ ప్లానర్ కృష్ణ మోహన్ తో కలిసి పరిశీలించారు.



## ముస్తాబైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనం...

- బుధవారం ఇబ్రహీంపట్నం శాసనసభ్యుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక దృష్టితో పనులు పూర్తి నెరవేరనున్న విద్యాకుసుమాల దశాబ్దాల కల...

**ఇబ్రహీంపట్నం 12 మే ప్రజాజ్యోతి:** ప్రభుత్వం నూతనంగా నిర్మించిన డిగ్రీ కళాశాల భవనం, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని నేడు ప్రారంభించుకొనుండడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. వేలాది విద్యార్థుల అక్షర కోవెల, భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే నూతన విద్యాసౌధం ఎట్టకేలకు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. దశాబ్దాలుగా నిర్లక్ష్యపు నీడలో నిలబడి... నేతల అసమర్థత నిదర్శనంగా నిలిచిన ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల భవనం అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంది. అద్దె భవనాలు, అరకొర వసతులు, షిఫ్ట్ పద్ధతి తరగతులతో ఏళ్ల పాటు సాగిన ఈ కళాశాల ప్రస్థానం ఇక సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఆచార్య వినోభాబావె నడయాడిన చోట సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న నూతన ఉన్నత విద్యాకేంద్రం ప్రారంభోత్సవం బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ఘనంగా జరిగనుంది.

**ఇన్నాళ్లూ అక్షరాలా ఆగిపోయిన అడుగు....**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో 2008లో కాంగ్రెస్ హయాంలో డిగ్రీ కళాశాలను మంజూరు చేయటం జరిగింది. నాటి నుంచి బీఆర్ఎస్ రెండు దఫాలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసినా.... భవనం మంజూరుకు పదేళ్లు పట్టింది. గత 18ఏళు ్లగా సరైన భవనం లేక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం పూట డిగ్రీ కళాశాల విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఎండలో వేచి చూడటం, సాయంత్రం వేళల్లో రవాణా సౌకర్యం లేక గ్రామీణ ప్రాంత విద్యార్థినులు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. 2017లో వినోభానగర్ లో నూతన భవన నిర్మాణానికి రూ.3.25కోట్లతో ప్రారంభోత్సవం చేసి, పదేళ్లుగా పనులు చేస్తూ వచ్చారు. అలా వదిలేసిన డిగ్రీ కళాశాల భవనానికి ఇక శాశ్వత పరిష్కారం లభించింది.

**ఎమ్మెల్యే మల్ రెడ్డి ప్రత్యేక చొరవతో సిద్ధమైన విద్యాకేంద్రం....**

విద్యతోనే వికాసం సాధ్యమని నమ్మే మన ప్రియతమ శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి.....





ఇబ్రహీంపట్నంలో షిఫ్ట్ ల వారీగా సాగుతున్న జూనియర్, డిగ్రీ తరగతులు, గ్రామీణ విద్యార్థుల కష్టాలు చూసి చలించిపోయారు. ఇందులో భాగంగానే ఉన్నతాధికారులతో మాట్లాడి, పెండింగ్ లో ఉన్న నిధులను మంజూరు చేయించారు. అనంతరం, అన్నీతానే.... గుత్తేదారులను, అధికారులను పరుగులు పెట్టించి, నూతన భవన నిర్మాణం ఎట్టకేలకు పూర్తి చేయించారు.

**ఇకపై ప్రకృతి ఒడిలో విద్యావికాసం....**

ఐదెకరాలలో రూపుదిద్దుకున్న ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం కార్పొరేట్ తరహాలో సకల సదుపాయాలతో సిద్ధమైంది. ప్రస్తుతం డిగ్రీ కళాశాలలో 550మంది విద్యనభ్యసిస్తుండగా.... బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కళాశాలలో 20మంది భోదన సిబ్బంది ఉండగా, నలుగురు గెస్ట్ ఫ్యాకల్టీ, మరో పది మంది వరకు భోదనేతర సిబ్బంది ఉన్నారు. చుట్టూ ప్రశాంతమైన వాతావరణం, విశాలమైన గదులు, డిజిటల్ ల్యాబ్స్ మరియు క్రీడా ప్రాంగణంతో ప్రైవేటు సంస్థలకు దీటుగా రూపుదిద్దుకుంది. 12 తరగతి గదులు, 3 ల్యాబ్స్, ఎన్ సీసీ రూం, అధ్యాపకులకు హాల్, స్పోర్ట్స్ రూం, విద్యార్థినీవిద్యార్థులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, విశాలమైన క్రీడాప్రాంగణం, ఆకట్టుకునే గ్రీన్ ప్లాంటేషన్ తో అద్భుతంగా తీర్చిదిద్దారు. కళాశాలకు కేటాయించిన స్థలం ఆక్రమణలకు గురికాకుండా ఎమ్మెల్ మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేకంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు.

**ఇది భవనం మాత్రమే కాదిది, ఆశల వారధి: ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి....**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించింది. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా తెలంగాణ భవితకు బంగారుబాటలు వేసేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందించేందుకు కృషిచేస్తున్నాం. ఇందులో భాగంగానే ఇన్నాళ్లు పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల భవనం పూర్తిచేశాం. కళాశాలలో అత్యున్నత విద్యనందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తాం. కార్పొరేట్ విద్య అంటూ లక్షల రూపాయలు వృథా చేసుకోకుండా ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే రంగారెడ్డి విద్యార్థులకు సూచించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే కళాశాల భవనం నేడు ప్రారంభించుకొనుండడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.

## తాడు బంధు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ, ఈ.వో నరేందర్

- మంత్రి కొండా సురేఖ రాకతో జై శ్రీరామ్ నినాదాలతో మారుమ్రోగిన తాడు బంధు ఆలయం
- రెండు గంటలు ఆలస్యంగా వచ్చిన మంత్రితో భక్తుల అసహనం
- ప్రత్యేక పూజలతో భక్తుల దర్శనానికి అంతరాయం అంటూ ఆగ్రహం

**బోయిన్ పల్లి,మే12.(ప్రజా జ్యోతి):** హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని తాడు బంధు దేవస్థానంలో మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి రాక సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి నరేందర్, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వామివారికి వస్త్రాలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ హనుమాన్ జన్మోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తాడు బంధు దేవాలయం



నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రాచీన ఆలయమని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దాతలు ముందుకు వస్తే అన్ని విధాలా సహకరిస్తామని పేర్కొన్నారు. శనిపీడలతో బాధపడే భక్తులు ఈ ఆలయాన్ని దర్శిస్తే స్వామివారి అనుగ్రహంతో సమస్యలు తొలగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్జేసీ రామకృష్ణరావు, ఆలయ అధికారులు సురేష్, జూనియర్ అసిస్టెంట్ జయవర్ధన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ ఆనంద్ కుమార్, ఎస్ఐ నందిత తదితరులు పాల్గొన్నారు. అయితే మంత్రి కొండా సురేఖ



ఆలయానికి సుమారు రెండు గంటలు ఆలస్యంగా రావడంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంత్రి రాక కోసం భక్తులను నిలిపివేయడంతో ఆలయంలో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

ఇక మంత్రి ఆలయంలోకి ప్రవేశించగానే భక్తులు ఒక్కసారిగా జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్ నినాదాలతో ఆలయ ప్రాంగణాన్ని మారుమ్రోగించారు. గర్భగుడి ముందు సుమారు 20 నిమిషాలకు పైగా ప్రత్యేక పూజలు కొనసాగడంతో భక్తుల దర్శనానికి ఆటంకం కలిగిందని కొందరు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొంతసేపు నినాదాలు, వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి.

## పరీక్షల పారదర్శకత కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం

**-టి రామకృష్ణ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు**

**శేరిలింగంపల్లి, మే 12 (ప్రజాజ్యోతి):** దేశవ్యాప్తంగా జరిగిన 2026 నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటన లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న దారుణ ఘటన.టి రామకృష్ణ మాట్లాడుతూ...రాత్రింబవళ్లు కష్టపడి చదివిన పేద,మధ్యతరగతి విద్యార్థుల ఆశలపై ఈ అవినీతి మాఫియా గుంపులు దాడి చేయడం అత్యంత ఖండనీయం.ప్రభుత్వాల నిర్లక్ష్యం, పరీక్షల నిర్వహణలో లోపాలు, ప్రైవేట్ కోచింగ్ మాఫియాలతో ఉన్న సంబంధాల వల్లే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయి.నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో పేపర్ లీక్ కావడం దేశ విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపి,బాధ్యులైన అధికారులపై,పేపర్ లీకేజీ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి.అలాగే పరీక్షను రద్దు చేసి, పూర్తి పారదర్శకతతో మళ్లీ నిర్వహించాలి.



విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ విధానాల కారణంగానే విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.పరీక్షా వ్యవస్థను కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టకుండా ప్రభుత్వమే బాధ్యతగా నిర్వహించాలి.విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, పరీక్షలలో అవినీతి అరికట్టాలని,ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) డిమాండ్ చేస్తోంది.

## ట్రిపుల్ టైం సర్కార్, డబుల్ టైం నీట్ పేపర్ లీక్ - టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆంగోత్ వెంకటేష్

**యాచారం, మే 12 (ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం, ఎన్టిఏ కలిసి లక్షలాది మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలోకి నెట్టాయని ట్రిపుల్ టైం సర్కార్, డబుల్ టైం నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి పాల్పడిందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఆంగోత్ వెంకటేష్ పవార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. గతంలో నీట్ పరీక్ష పేపర్ లీక్ అయ్యిందని ఈసారైనా పకడ్బందీగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పరీక్ష నిర్వహిస్తారని ఆశించిన ఏ మాత్రం బాధ్యత లేకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరం అన్నారు. నీట్ పరీక్షను నిర్వహించే ఎన్టిఏ.. కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తుందని లీకేజీ వ్యవహారంలో పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల ఆశలు, వారి భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఖండిస్తున్నామని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## సైబర్ నేరాలకు చెక్ పెట్టే దిశగా ఉప్పల్ పోలీస్ల భారీ అవగాహన సభ!



**ఉప్పల్, మే 12, ప్రజా జ్యోతి :** మంగళవారం రామంతపూర్ గాంధీ నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఉప్పల్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ క్రైమ్ అవేర్నెస్ కార్యక్రమం ప్రజల్లో విశేష స్పందన తెచ్చుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉప్పల్ డీసీపీ సురేష్ రెడ్డి జాయింట్ డీసీపీ వెంకటరమణ ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి ఉప్పల్ సీఐ రామలింగారెడ్డి ఎస్సై మధు రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్ పాల్గొని ప్రజలకు సైబర్ మోసాలపై కీలక సూచనలు చేశారు.

ఓటీపీ మోసాలు...బ్యాంక్ ఫ్రాడ్స్... ఫేక్ లింక్స్...

సోషల్ మీడియా స్కామ్స్...ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల భద్రత కోసం పోలీసులతో కలిసి అడుగులు వేస్తున్న నాయకుడు మహమ్మద్ రఫీక్ సమస్య ఏదైనా ప్రజల పక్షాన ముందుండే పోరాట యోధుడు రామంతపూర్ ప్రజల నమ్మకం సేవే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకత్వం!

"అవగాహనే రక్షణ... అప్రమత్తతే ఆయుధం" అని అన్నారు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన ఈటల రాజేందర్



**రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి:** ఎల్బీనగర్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాజేష్‌ను మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కామినేని ఆసుపత్రికి వెళ్లి బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1,60,000 విలువైన చెక్కును అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు. ప్రజల కష్టసుఖాల్లో ముందుండి సహాయం చేసే నాయకుడు ఈటల రాజేందర్ అని బీజేపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ కొనియాడారు.

## ఆరోగ్యవంతమైన సమాజ అభివృద్ధితోనే దేశ అభివృద్ధి






**తలకొండపల్లి,మే12 (ప్రజాజ్యోతి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో బుధవారం అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం 2026 నిర్వహణ " ఆహార భద్రత మరియు పోషణ కోసం ప్లాంట్ బయోసెక్యూరిటీ" అనే ప్రపంచ థీమ్‌తో అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం -- 2026 కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మొక్కల ఆరోగ్యం,జీవ వైవిధ్య పరిరక్షణ,పంటల వైవిధ్యీకరణ,నేల ఆరోగ్య నిర్వహణ మరియు స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనడైరెక్టర్ (సి-నార్) డా. రాములు మాట్లాడుతూ..వ్యవసాయంలో జీవ వైవిధ్య పరిరక్షణ,ప్లాంట్ బయోసెక్యూరిటీ యొక్క ప్రాముఖ్యతను వివరించారు.జీవ వైవిధ్యాన్ని సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడబడటమే కాకుండా,పంటలు చీడపీడలు మరియు తెగుళ్లకు ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు.అలాగే ఆక్రమణ కలుపు మొక్కలు,కొత్త రకాల పురుగులు మరియు వ్యాధులు వ్యవసాయ వ్యవస్థలోకి ప్రవేశించకుండా నిరోధించడంలో క్వారంటైన్ చర్యల ప్రాముఖ్యతను వివరించారు.రైతులకు కలుపు మొక్కల వ్యాప్తి,రసాయన మందులు మరియు ఎరువుల అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.పిచికారీ సమయంలో రక్షణ చర్యలు పాటించడం,రసాయనాలను జాగ్రత్తగా వినియోగించడం మరియు మట్టి పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులు వాడాలని సూచించారు.అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం వల్ల నేల సారం తగ్గిపోవడంతో పాటు పర్యావరణం మరియు మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన డా. లతీఫ్ పాషా పంటల వైవిధ్యీకరణ ప్రాముఖ్యతను వివరించారు.వరి,పత్తి వంటి ఏకపంట సాగు నుండి అపరాలు,నూనెగింజలు,చిరుధాన్యాలు మరియు ఇతర వైవిధ్యమైన పంటల వైపు మళ్లడం ద్వారా చీడపీడల సమస్యలు తగ్గి, నేల సారం మెరుగుపడటంతో పాటు రైతుల ఆదాయం మరియు పోషకాహార భద్రత పెరుగుతుందని తెలిపారు.డా. శ్రీదేవి నేల ఆరోగ్య నిర్వహణపై ప్రత్యేక ప్రసంగం చేశారు.ఆరోగ్యకరమైన నేలే ఆరోగ్యకరమైన మొక్కలకు మరియు స్థిరమైన వ్యవసాయానికి పునాదిగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.మట్టి పరీక్షలు, సమతుల్య పోషక నిర్వహణ, సేంద్రీయ ఎరువులు, బయోఫర్టిలైజర్లు మరియు సమీకృత పోషక నిర్వహణ పద్ధతులను పాటించడం ద్వారా నేల సారం మరియు పంటల దిగుబడులు మెరుగుపడతాయని వివరించారు. నేలలో సేంద్రీయ కార్బన్ మరియు సూక్ష్మజీవుల చలనం పెంచడం దీర్ఘకాలిక వ్యవసాయ స్థిరత్వానికి అవసరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాట్లాడిన డా. చిరంజీవి సమీకృత వ్యవసాయ విధానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.పంటలతో పాటు పశుపోషణ, చేపల పెంపకం, కోళ్ల పెంపకం, వర్మీ కంపోస్టింగ్ వంటి అనుబంధ వ్యవస్థలను సమన్వయం చేయడం ద్వారా వ్యవసాయ వ్యయాలు తగ్గి రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు.వ్యవసాయ వనరుల సమర్థ వినియోగం, పర్యావరణ పరిరక్షణ మరియు స్థిరమైన జీవనోపాధికి సమీకృత వ్యవసాయం ఎంతో దోహదపడుతుందని చెప్పారు.రైతులు శాస్త్రవేత్తలతో చర్చలు నిర్వహించి రైతుల సందేహాలను సమాధానం ఇచ్చి స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ,ఉప సర్పంచ్ గుమ్మడి రాజు,మాజీ ఉపసర్పంచ్ చెన్నకేశవులు,మాజీ సర్పంచ్ బండి రఘుపతి,వార్డు సభ్యులు వంకూరి శ్రీరామ్,ఆల్వాల్ రెడ్డి,రాజు గ్రామ రైతులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సూదిని రామ్ రెడ్డికి ఘన సన్మానం



**తలకొండపల్లి,మే12 (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర పంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్ సూదిని రామిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుస్తారు.ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వస్పుల జంగయ్య,చుక్కాపూర్ మాజీ ఎంపిటిసి దాసరి యాదయ్య,ఆర్.సి కాన్వెన్షన్ హాల్ ప్రోఫైటర్ కాలూరి రామచంద్రయ్య,డొక్కా పురుషోత్తం,శ్రీను తదితరులు ఉన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన మత్స్యకార సహకార సంఘం సొసైటీ ఎన్నికలు





**తలకొండపల్లి మే12 (ప్రజాజ్యోతి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని రాంపూర్ గ్రామ సూర్యరావు చెరువుకు సంబంధించి మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిసాయి.ఈ ఎన్నికలు మత్స్యకార సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్టర్ కోఆపరేటివ్ ఆర్.విజయ ఆధ్వర్యంలో ఎలక్షన్ జరిగింది.ఈ సొసైటీ ఎన్నికల్లో 17మంది ముదిరాజ్ సభ్యులు డైరెక్టర్ గా పోటీలో ఉన్నారు.నమూనా బ్యాలెట్ పేపర్ ద్వారా జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ మద్దతుదారులు 8మంది డైరెక్టర్ గా ఘనవిజయం సాధించారు.కాంగ్రెస్ మద్దతు అభ్యర్థిగా ఒకరు విజయం సాధించారు.మత్స్యకార సహకార సంఘం ఎన్నికల్లో డైరెక్టర్లుగా గెలుపొందిన వారి ఓట్ల వివరాలు ఇలా...చిలకం బిక్షపతి(48),చిలుకం శేఖర్(49),తిక్కల మహేష్(46),తిక్కల యాదయ్య(45), సప్పిడి కృష్ణయ్య(46),సప్పిడి జంగయ్య(48), సప్పిడి రమేష్(44),మియ్యడి అమృత(55),సప్పిడి యాదమ్మ(52) ఓట్లతో గెలుపొంది విజయ దుందుభి మోగించారు.ఈ మేరకు గెలుపొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అధికారులు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా గెలుపొందిన డైరెక్టర్లకు గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్ లతోపాటు గ్రామ ముదిరాజ్ నాయకులు అభినందనలు తెలిపారు. అనంతరం గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ ఇన్స్పెక్టర్ గోపీనాథ్,జూనియర్ అసిస్టెంట్లు సంతోష్ కుమార్,విజయ్ కాంత్ గ్రామ సర్పంచ్ వట్టేల నిర్మల శ్రీశైలం యాదవ్,ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు,ముదిరాజ్ నాయకులు జానయ్య,రమేష్,పకీర,మహేష్ శివకుమార్,శ్రీను తదితరులున్నారు.

## భారతదేశపు అగ్రగామి టెలికమునికేషన్ సేవ సంస్థల ఒకటైన భారత ఎయిర్టెల్

- సంపూర్ణంగా నిర్వహించబడే ఏకీకృత జీరో ట్రస్ట్ ఆర్కిటెక్చర్ (జెడ్టీఏ) భద్రతా పరిష్కారం

-సంస్థలు తమ భద్రతా వ్యయాలలో 30% వరకు ఖర్చు పొదుపు పొందగలవు

**శేరిలింగంపల్లి,మే12 (ప్రజాజ్యోతి):** నేటి ఏఐ-ఆధారిత యుగంలో,సైబర్ దాడులు వేగంగా, విస్తృతంగా అత్యంత సంక్లిష్టంగా పెరుగుతున్నాయి.ఇవి చాలా రక్షణ వ్యవస్థలను అధిగమిస్తూ ప్రతి సంస్థనూ సంభావ్య లక్ష్యంగా మారుస్తున్నాయి. 2025లో మాత్రమే 20 లక్షలకు పైగా సైబర్ భద్రతా సంఘటనలు నమోదయ్యాయి,అనే వాస్తవం ఈ ముప్పు తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తుంది.ఈ పెచ్చరిల్లుతున్న ముప్పులను ఎదుర్కొనేందుకు, భారతదేశపు అగ్రగామి టెలికమ్యూనికేషన్ సేవా సంస్థల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ ("ఎయిర్‌టెల్") యొక్క బీటూబీ విభాగమైన ఎయిర్‌టెల్ బిజినెస్ ఎయిర్‌టెల్ సెక్యూర్ వర్క్‌ఫోర్స్ ని నిర్మించింది.ఇది దేశంలో తొలిసారిగా అందుబాటులోకి వచ్చిన, సంపూర్ణంగా నిర్వహించబడే,ఏకీకృత జీరో ట్రస్ట్ ఆర్కిటెక్చర్ (జెడ్టీఏ) భద్రతా ప్లాట్‌ఫారమ్ సంస్థలకు ఎండ్-టు-ఎండ్, కంప్లైయెన్స్-రెడీ భద్రతా స్టాక్‌తో కూడినది.ఎయిర్‌టెల్ యొక్క పాన్-ఇండియా నెట్‌వర్క్,24ఇ7 నిపుణుల నిఘా జాతీయ స్థాయిలో నిరూపితమైన భద్రతా చరిత్రతో ఆధారపడిన ఎయిర్‌టెల్ సెక్యూర్ వర్క్‌ఫోర్స్ సంస్థలకు అవసరమైన రక్షణను పొదుపైన ధరలో అందిస్తుంది.అదే సమయంలో, సొంత భద్రతా వ్యవస్థలను నిర్మించుకుని నిర్వహించుకోవడంలో కలిగే కార్యాచరణ భారం నుండి సంస్థలను విముక్తి కలిగిస్తుంది. భారతదేశపు డీపీడీపీ చట్టానికి అనుగుణంగా రూపొందించబడిన ఈ పరిష్కారం వినియోగదారులు,పరికరాలు,నెట్‌వర్కులు, అప్లికేషన్లు,డేటా వంటి అన్ని ఎండ్‌పాయింట్లను సురక్షితంగా కాపాడుతుంది.శరత్ సిన్హా, సీఈఓ మాట్లాడుతూ... ఎయిర్‌టెల్ బిజినెస్ నేడు సంస్థలు నిరంతరం పరిణామం చెందుతున్న,లక్ష్యంగా చేసుకున్న, ఏఐ-ఆధారిత దాడుల నుండి తమ అంతిమ వినియోగదారులను,పరికరాలను రక్షించుకోవడంలో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నాయి.సురక్షిత కనెక్టివిటీ,సైబర్ సెక్యూరిటీలో మా నాయకత్వ స్థానాన్ని పునాదిగా చేసుకుని,వినియోగదారులు,డేటా, పరికరాలను ఎప్పుడైనా,ఎక్కడైనా రక్షించడానికి ఎయిర్‌టెల్ సెక్యూర్ వర్క్‌ఫోర్స్ ని రూపొందించాము.ఈ పరిష్కారం కనెక్టివిటీ మరియు నిర్వహణ భద్రతను 24ఇ7 నిపుణుల నిఘాతో మేళవించిన ఎండ్-టు-ఎండ్ రక్షణను అందిస్తుంది. దీని ఏకీకృత విధానం మా ఎంటర్‌ప్రైజ్ కస్టమర్లకు గరిష్ట విలువను అందించడంలో సహాయపడుతుంది వారికి భద్రతా వ్యయాలలో 30% వరకు పొదుపు చేసుకుంటూ,తాము రక్షితంగా ఉన్నామనే విశ్వాసంతో తమ వ్యాపార వృద్ధిపై దృష్టి కేంద్రీకరించే అవకాశం కల్పిస్తుంది.

హైబ్రిడ్ వర్క్‌ఫోర్స్ కోసం రూపొందించబడి, స్థిరమైన జెడ్టీఏ ఫ్రేమ్‌వర్క్‌పై నిర్మించబడిన ఈ పరిష్కారం సాధనాల అధిభారం,హెచ్చరికల అలసట,ప్రతిభావంతుల కొరత వంటి నేటి భద్రతా సవాళ్లను పరిష్కరిస్తుంది.విచ్ఛిన్నమైన,బహుళ-విక్రేత విన్యాసాలను ఒక ఏకీకృత ప్లాట్‌ఫామ్‌తో, 24ఇ7 సమీకృత భద్రతతో భర్తీ చేయడం ద్వారా ఎయిర్‌టెల్ సెక్యూర్ వర్క్‌ఫోర్స్ ఎండ్‌పాయింట్ గుర్తింపు,ప్రతిస్పందనను బలోపేతం చేస్తుంది, ప్రతి టచ్‌పాయింట్ వద్దా సురక్షిత రిమోట్ యాక్సెస్ కల్పిస్తుంది.అధికతర రక్షణతో పాటు మెరుగైన వ్యయ సామర్థ్యాన్ని అందిస్తుంది.

భారతదేశపు డీపీడీపీ చట్టానికి అనుగుణంగా, ఎయిర్‌టెల్ సెక్యూర్ వర్క్‌ఫోర్స్ బలమైన పర్యవేక్షణ, ప్రతిస్పందన,పాలనకు ఆడిట్-గ్రేడ్ లాగులు, డేటా చలన నియంత్రణలు, నిర్మాణాత్మక సంఘటన వర్క్‌ఫ్లోలను అందిస్తుంది.ఏకీకృత డ్యాష్‌బోర్డు సంస్థలకు నెట్‌వర్కులు, ఎండ్‌పాయింట్లు, వినియోగదారులు,డేటా అంతటా ఒకే చూపు అందిస్తుంది.ఇమెయిల్, వెబ్,అప్లికేషన్లు, పరికరాల్లో ఉద్యోగుల భద్రతకు తోడ్పడుతుంది. అనధికారిక క్లౌడ్,ఏఐ అప్లికేషన్లపై దృశ్యమానత కూడా అందుబాటులో ఉంటుంది.

## ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలి

రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు





**ఇబ్రహీంపట్నం 12 మే ప్రజాజ్యోతి:** దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సులో పాల్గొనడానికి మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం భవనానికి చేరుకున్న రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కు, సభ్యులకు జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ, ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో దక్షిణ తెలంగాణా స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని, సభ్యుడు ఎస్.సుధీర్ రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమీక్ష నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, దక్షిణ తెలంగాణా జిల్లాల నుండి విచ్చేసిన అదనపు కలెక్టర్లు తమ తమ జిల్లాలలో స్థానిక సంస్థల పని తీరు గురించి చైర్మన్ కు వివరించారు. నగర పాలక సంస్థలు, మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ... గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల ప్రజలను కూడా ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వాములు చేస్తూ, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఆదాయ వనరులు అభివృద్ధి చేసుకుని, పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. చైతన్యవంతమైన సమాజ నిర్మాణం జరిగి, అన్ని వర్గాల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఆర్థిక సంఘం ధ్యేయమని చైర్మన్ స్పష్టం చేశారు. ఆర్థిక అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు సమసిపోయి, మానవ సంపద, వారి శక్తియుక్తులు సమాజానికి ఉపయోగపడేలా కృషి జరగాలన్నారు. ఈ దిశగా ప్రజలకు, ప్రభుత్వానికి కమిషన్ వారధిగా నిలుస్తూ సామాజిక అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఫైనాన్స్ కమిషన్ సూచనలు చేస్తుందని తెలిపారు.

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ప్రతి నివాస గృహానికి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా, పారిశుధ్య నిర్వహణ పక్కాగా కొనసాగేలా స్థానిక సంస్థలు నిశిత పర్యవేక్షణ చేయాలన్నారు. ఇటీవలే కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, మేయర్లు, చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, స్థానిక సంస్థల బలోపేతంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. నిధుల కోసం పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఆధారపడకుండా స్థానికంగా ఆదాయం సమకూర్చే అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పన్ను వసూళ్లు, ప్రకటనలపై వచ్చే రాబడి, వృత్తి పన్ను, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి నిర్ణీత రుసుము వసూలు చేస్తూ స్థానిక సంస్థలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా కృషి చేయాలని అన్నారు. స్థానిక సంస్థలలో ఆదాయం వనరులు పెంపొందించుకునేందుకు గల అవకాశాలపై ప్రజాప్రతినిధులు, అధికారుల నుండి సలహాలు స్వీకరించారు. వీటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని చైర్మన్ సిరిసిల్ల రాజయ్య వెల్లడించారు. ఈ సదస్సులో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు కిరణ్మయి, దక్షిణ జిల్లాల అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, జి.ఫణీంద్ర రెడ్డి, రంగారెడ్డి జిల్లా జెడ్పీ సీ.ఈ.ఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, మున్సిపల్ చైర్ పర్సన్లు, కమిషనర్ లు, డిపిఒలు, డీఎల్పీఓలు, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

